
ప్రజాశక్తి

శుక్రవారం 6 అక్టోబర్ 2023





## హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

హెూటల్ మేనేజ్మెంట్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్టు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో భారత, ఎపి పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ అఫ్ హెూటల్ మ్యానేజ్మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్‌లో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్టు వివరించారు. డెమీ చెఫ్ ద పార్టీ (4 నెలల వ్యవధి), రెస్టారెంట్ కెప్టెన్ (3 నెలల వ్యవధి) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారన్నారు. ఇంటర్, ఐటిఐ ఉత్తీర్ణులై, 18 నుండి 28 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. వివరాలకు 9160912690, 9100558006, 9032697478 ను సంప్రదించవచ్చని, ఆసక్తిగల అభ్యర్థులు https://rb.gy/0d3wz వెబ్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన అన్నారు.

# ఈ రోడ్లపై ప్రయాణం భయం... భయం

- ప్రమాదాలకు నిలయంగా గుంతలు
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

**జిల్లాలో రోడ్లు గజానికొక గొయ్యితో దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లు మీదుగా ప్రయాణించాలంటే వాహన చోదకులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లపై నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకున్న పాపా లేదు. దీంతో ప్రయాణికులకు, రోగులకు అవస్థలు తప్పడం లేదు.**



చెరువును తలపిస్తున్న కుసిమి జంక్షన్ నుండి ముత్యాలు వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలి -అలికాం ప్రధాన రహదారి గోతుల మాయంగా మారి వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి. నెల రోజుల క్రితం పెద్దదిమిలి సమీపంలో బగ్గమర్రిపాడు గెడ్డ వంతెన ప్రమాదకరంగా బీటలు వారింది. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. కానీ అది ఏ రోజు కూలుతుందో తెలీని పరిస్థితి. సింగిడి నుంచి బిల్లుమడ మధ్య రోడ్డు పూర్తిగా గోతుల మాయంగా మారి ప్రయాణించడానికి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. వారం రోజులు క్రితం బిల్లుమడ -గురండి గ్రామాల మధ్య ప్రధాన రహదారి పూర్తిగా గొయ్యిపడి, వాహనాల రాకపోకలు సుమారు 3 గంటల పాటు నిలిచిపోయాయి. బత్తిలి -అలికాం ప్రధాన రహదారిపై బిల్లుమడ వద్ద ఉన్న



బత్తిలి-అలికాం వెళ్తే ప్రధాన రహదారిలో గల వంతెనపై ఏర్పడ్డ భారీ గొయ్యి

వంతెనకు వేసిన కాంక్రీట్ గజాలు బయటి రావడంతో వాహనదారులు బిక్కు బిక్కు మంటూ నడపాల్సిన పరిస్థితి. ఒడిశా వాసులు నిత్యం వేల సంఖ్యలో బత్తిలి -అలికం రహదారి మీదుగా వైజాగ్, శ్రీకాకుళం పట్టణాలకు వైద్యం, వ్యాపార నిమిత్తం వెళుతుంటారు. ఇటీవల అటుగా వెళ్తున్న ఎం పి పి ప్రతినిధి తోట సింహాచలం బిల్లుమడ వంతెనపై బయటకు వచ్చిన కాంక్రీట్ ఐరన్ నిర్మాణాలు పరిశీలించి ఆర్ అండ్ బి అధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ప్రధానంగా ఒడిశా నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీలోడుతో వచ్చే ఇసుక లారీల వల్ల రోడ్డు, వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఒడిశా నుంచి ఇసుక రవాణా ఆపే పరిస్థితి లేదని, ఇలా పూర్తి స్థాయి మరమ్మతులు లేకుండా కొనసాగితే రోడ్డుపై వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి హెవీలోడ్‌తో వచ్చే ఒడిశా ఇసుక లారీలను నిలిపివేసి పూర్తి స్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


**సీతంపేట :** మండలంలో కుసిమి జంక్షన్ నుండి ముత్యాలు వరకు రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బి.చంద్రరావు తెలిపారు. సిలగాం నుంచి ముత్యాలు జంక్షన్ వరకు రోడ్డు గోతులు కావడంతో చెరువులు మాదిరిగా తయారైందని, దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి మార్గాన అనేక గ్రామాలు ఉన్నాయన్నారు. కుసిమి సంతకు కూడా అనేకమంది గిరిజనులు, వ్యాపారాలు వస్తుంటారని రద్దీగా ఉంటుందని అన్నారు. ఈ రహదారి మీదుగా రోగులను పాలకొండ , సీతంపేట గాని తరలించాలంటే కష్టమవుతుందని తెలిపారు. వెంటనే ఈ రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# అధికారులకు బుద్ధి లేదా?

- గ్రామాల్లో సచివాలయానికో వైద్య శిబిరం
- పట్టణాల్లో 6 సచివాలయాలకో క్యాంపా?
- డిప్యూటీ డిఎంహెచ్ఒపై డిప్యూటీ సిఎం ఫైర్

ప్రజాశక్తి - సాలూరు

జిల్లా వైద్యాధికారికి, జిల్లా డిసిహెచ్ఎస్‌కు బుద్ధి ఉందా లేదా? బుద్ధి ఉన్నవారెవరూ ఆరు సచివాలయాల పరిధిలో ఉన్న 2500మంది రోగులకు ఒక వైద్య శిబిరం నిర్వహించరు. గ్రామాల్లో సచివాలయానికో వైద్య శిబిరం నిర్వహిస్తూ బాగా సేవలందిస్తున్నారు, పట్టణాల్లో ఆరు సచివాలయాలకు ఒక చోట వైద్య శిబిరం నిర్వహిస్తారా? అంటూ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఆరు సచివాలయాలకు ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజన్నదొర, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ టి.జయరాం, డిప్యూటీ డిఎం హెచ్ఒ హాజరయ్యారు. ఆరు సచివాలయాల పరిధిలో ఉన్న రోగులు వేల సంఖ్యలో హాజరు కావడంతో పరిస్థితి గందరగోళంగా మారుతుందని భావించి అధికారులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 8 సచివాలయాల్లో రెండు, మూడు శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు తీసుకొని రావడానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ శిబిరాల్లో నమోదు వైద్య పరీక్షలు చేసుకున్న తర్వాత ఎంతటి పెద్ద రోగం బయటపడినా ప్రభుత్వం చికిత్సకి అయ్యే ఖర్చును భరిస్తుందని చెప్పారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్టు నిర్వహించిన పోషకాహారం స్టాల్ ని ఆయన పరిశీలించారు.



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

అంగన్వాడీ కార్యకర్తలు ఆయనకు పిండివంటల రుచి చూపించారు. ఐసిడిఎస్ పిడి బి.సత్యవతి ఆధ్వర్యాన స్టాల్ ఏర్పాటు చేశారు.

### ఇరుకు ప్రదేశంలో వైద్య శిబిరం

పట్టణంలోని ఒక అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఉన్న ఆరు సచివాలయాలకు సంబంధించిన రోగులకు వార్డు వాలంటీర్ల ద్వారా అధికారులు టోకెన్లు జారీ చేశారు. పట్టణంలోని డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్ మైదానం ఇరుకు ప్రదేశం కావడంతో హాజరైన రోగులతో కిటకిటలాడింది. ఎక్కువమంది అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు, మహిళలు హాజరయ్యారు. 2500మందికి వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కేష్ సీట్లు మాత్రం సుమారు 1400మందికి జారీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి సచివాలయానికి ఓ వైద్య శిబిరం నిర్వహిస్తుండడంతో వైద్య సేవలు సక్రమంగా అందుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పట్టణాల్లో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ పరిధి ఉంటే ఆరు సచివాలయాలకు సంబంధించిన 12వార్డుల ప్రజలు వుంటారు. వీరందరికీ ఒకేచోట వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారులు భావించడం అనాలోచిత నిర్ణయం. పట్టణాల్లో వైద్య శిబిరాల నిర్వహణ పై ప్రణాళికాబద్ధంగా అధికారులు వ్యవహరించకపోవడంతో హాజరైన రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టం గా కనిపించింది. దీంతో కొంతమంది రోగులు నిరాశ తో వెనుదిరిగాల్సి వచ్చింది.

### చిన్న పిల్లల వైద్యుల్లేక నిరాశ

ఇంత పెద్ద వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్యుల్లేకపోవడంతో చాలా మంది తల్లులు నిరాశతో వెనుదిరిగారు. చిన్న పిల్లలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు చూసే వైద్యులు వస్తారని ప్రచారం చేయడంతో కొంతమంది బాలింతలు చంటిపిల్లల్ని తీసుకుని వచ్చారు. వీరికి సంబంధించిన వైద్యులు లేరని తెలియడంతో నిరాశ తో వెళ్లిపోయారు.

## నారంశెట్టి నవలకు దక్కిన గౌరవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణానికి చెందిన ప్రముఖ బాల సాహితీ వేత్త , కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన 'ఇ-తరం కుర్రాడు' నవలకు మరో గౌరవం దక్కింది. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాదుకు చెందిన మంచి పుస్తకం ప్రచురణ సంస్థ పిల్లల్లో చదివించే గుణం పెంపొందించడానికి " పుస్తకాలతో స్నేహం" పేరుతో పుస్తకాల సిరీస్ ముద్రించింది. ఐదేసి పుస్తకాలు ఒక సెట్‌గా అమ్మకానికి ముద్రించారు. బడి వయసు రాని పిల్లల నుండి బడి వయసు నిండిన పిల్లల కోసం 10 సెట్లు ముద్రించారన్నారు. మొదటి తొమ్మిది సెట్లు తొమ్మిదేళ్ల లోపు వారి కోసం ముద్రించగా పదో సెట్ మాత్రం 9 నుండి 16 ఏళ్ల వారి కోసం ముద్రించినట్టు తెలిపారు. ఈ విభాగంలో ఐదు పుస్తకాలు ఉండగా అందులో నారంశెట్టి రచించిన 'ఇ-తరం కుర్రాడు' నవల ముద్రించారని, మిగతా నాలుగు పుస్తకాలు అనువాద పుస్తకాలు కాగా తెలుగు నుండి డైరెక్ట్ రచన తనదన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు, రచయితలు నారంశెట్టిని అభినందించారు.




ప్రచురణకు నోచుకున్న ఇ-తరం కుర్రాడు

# డిగ్రీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలి

## సైకిల్ యాత్రలో ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - వీరఘట్టం, గరుగుబిల్లి

గరుగుబిల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మించాలని, పోస్టు మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, వీరఘట్టంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం రాష్ట్ర ప్రభుత్వం నిర్మించకపోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా సైకిల్ యాత్ర కమిటీ విమర్శించింది. ఎస్ఎఫ్ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నాలుగో రోజు గరుగుబిల్లి, వీరఘట్టం మండలాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీలు, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసేలా అనేక రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్న జగనన్న ప్రభుత్వం మెరుగైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలం చెందిందని వాపోయారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదవలేక లేక చదువు మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఒకే భవనంలో రెండు కళాశాలలు నిర్వహించడం అన్యాయం, కావున ప్రభుత్వ వెంటనే స్పందించి మెరుగైన విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మండల కేంద్రంలో



వీరఘట్టంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

పోస్టుమెట్రిక్ హాస్టళ్లు, జూనియర్ కళాశాలకు నూతన భవనం ఏర్పాటుకై, డిగ్రీ కళాశాల సొంత భవనం నిర్మాణంకై ఎస్ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టళ్లకు బకాయిలుగా నిలిచిన మెస్ ( డైట్ ) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హనర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఎన్ఇపి రద్దు చేయాలని, 117జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లల్లో పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిచో యాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.రాజు, హెచ్.సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు. నాయకులు అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు



పాలకొండ : సిడిపిఒకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

## ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ సమయంలో ఫేస్ రికగ్నిషన్ సిస్టం యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఒ బి.సత్యవతికి యూనియన్ అధ్యక్షులు బి.రాధ, సెక్టార్ నాయకులు శ్యామల, నారాయణమ్మ, శశికళ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 1నుంచి ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలకు పోషకాహారం కిట్లు పంపిణీ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్లు సరిగ్గా పనిచేయకపోవడంతో ఎఫ్ఆర్ఎస్ అమలు కావడం లేదన్నారు. దీనివల్ల బాలింతలు, గర్భిణులను పదేపదే కేంద్రాలకు రప్పించే పరిస్థితి తలెత్తుతుందని తెలిపారు. దీని నివారణకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**పాలకొండ :** అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్వాడీ ఐసిడిఎస్ పిఒకు వినతి పత్రం అందజేశారు. గర్భిణీలకు, బాలింతలకు ఆహారం ఇచ్చే సమయాల్లో యాప్‌లో నమోదు చేయమనడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఫోన్లు పనిచేయకపోవడం, సిగ్నల్స్ లేకపోవడం వల్ల డౌన్లోడ్ చేయలేకపోతున్నామని అన్నారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో అధ్యక్షులు జెసి భాయ్, కార్యదర్శి బి.అమరవేణి, శారద, తదితులున్నారు.

# త్వరితగతిన ఇకెవైసి చేపట్టాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇకెవైసిని పూర్తి చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె మండలంలోని చిన్నభోగిలి, లక్ష్మీపురం, బుడ్డిడిపేటలో పర్యటించారు. సూపర్‌చెక్‌లో భాగంగా పంట బుక్ చేసిన సర్వే నెంబర్‌లో ఆ పంటలు ఉన్నాయా, లేదా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించి నిర్ధారించాలన్నారు. ఇదిలా ఉండగా మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్ని గ్రామాల్లో పర్యటించి ఇకెవైసి ఇప్పటి వరకూ 82శాతం జరిగిందని, క్రాప్ బుకింగ్ కూడా 98శాతం జరిగిందని తెలిపారు.

**బలిజిపేట :** ఇ-క్రాప్‌లో భాగంగా బయోమెట్రిక్‌ను పలగరలో రైతుల బయోమెట్రిక్ నమోదును మండల వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేసిన పంటకు ప్రతి రైతు బయోమెట్రిక్ వేసి ఆమోదించాలని, వారు వేసిన పంటను ఒకసారి చూసుకొని ఆధార్ బయోమెట్రిక్ వేయాలని అన్నారు. ఇంకా ఎవరైనా రైతులు వేసిన పంట ఇ- క్రాప్ చేయించుకోవడానికి ఈనెల 8 వరకు సమయం ఉందన్నారు. కావున ఇ-క్రాప్‌లో నమోదు కాకపోతే నమోదు చేసుకోవాలన్నారు. ఒకసారి రైతులు సాగుచేసిన పంట ఇ- క్రాప్ నందు నమోదైందో, లేదో ఆర్‌బికెలో తెలుసుకోవాలని తెలిపారు. ప్రస్తుతానికి 19500



ఇకెవైసి నమోదును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

ఎకరాలు గానూ 19050 ఎకరాలు నమోదైందన్నారు. 8856మంది రైతులకు గానూ 5862 మంది బయోమెట్రిక్ నమోదు చేసుకున్నారని, ఇంకా 2994 మంది రైతులు బయోమెట్రిక్ నమోదు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. కావున మిగతా రైతులు ఈనెల 8లోగా బయోమెట్రిక్ వేసుకొనేలా చర్యలు తీసుకోవాలని విఎఎను ఆదేశించారు.

## ప్రతి ఇల్లూ స్వచ్ఛతగా ఉండాలి

ప్రజాశక్తి - భామిని

మన ఇల్లు, మన పరిసరాలు స్వచ్ఛంగా ఉంటే గ్రామం కూడా స్వచ్ఛంగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. సంకల్ప్ సప్తహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 27 పంచాయతీలో స్వచ్ఛ ఇల్లు, స్వచ్ఛ గ్రామం కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ ద్వారా స్వచ్ఛతపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కీసరలో సంపద తయారీ కేంద్రాన్ని డిపిఒ పరిశీలించారు. గ్రామాల్లో స్వచ్ఛత రావాలంటే ప్రజలు తమ గృహ పరిసరాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. అనంతరం క్లాప్ మిత్రాలతో మాట్లాడారు. బాలేరులో జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రాలు రోడ్డు శుభ్రం చేసి, స్వచ్ఛతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.చంద్రరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.మహీంద్ర, డిఎల్‌పిఒ జె.రాంప్రసాదరావుదున్నారు.



చెత్తాచెదారంతో డంపింగ్‌యార్డును తలపిస్తున్న వెంకటరాయ కోనేరు ప్రాంతం

# ముక్కు మూసుకోవాల్సిందే

## డంపింగ్ యార్డుగా మారిన వెంకటరాయ కోనేరు

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పాలకొండ

డంపింగ్ యార్డ్ సమస్య పాలకొండను తీవ్రంగా ఉంది. మేజర్ పంచాయతీ నుంచి కూడా ఈ సమస్య గుదిబండగానే ఉంది. డివిజన్ కేంద్రమైన పాలకొండ నగరపంచాయతీలో ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పట్టణ నడిబొడ్డునున్న వెంకటరాయ కోనేరు వద్ద చెత్తను డంప్ చేస్తున్నారు. 4వ వార్డుకు అతి సమీపంలో డంప్ చేయడంతో ఆ వార్డు పరిధిలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ చెరువు మీదగా ఆసుపత్రితో పాటు పల్లు ప్రాంతాలకి వెళ్లే ప్రధాన రహదారి. దీంతో ఆ చెరువుపై నడవాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడద కూడా ఎక్కువగానే ఉంది. కొన్ని నెలల క్రితం పట్టంలో కొత్త వీధి దగ్గర రెండు ఎకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చుట్టూ పక్క ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సిరికొండలో డంపింగ్ యార్డుకు ఐదెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. స్థానికులు అడ్డుకొని కోర్టును ఆశ్రయించడంతో ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో వెంకటరాయ కోనేరు దగ్గరే చెత్తను పోగులుగా వేస్తున్నారు.

## న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర న్యాయవాదుల సంఘం తీసుకున్న అనుచిత నిర్ణయం వల్ల న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉండడంతో గురువారం న్యాయవాదుల సంఘ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులంతా విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర న్యాయవాదుల సంఘం మిగిలిన న్యాయవాదులతో ఎలాంటి చర్చలు జరపకుండా తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, ప్రతి దరఖాస్తుపైనా ఇప్పటి వరకు ఒక రూపాయి విలువ గల స్టాంపును వినియోగించడం జరిగిందని తెలిపారు. అయితే అందుకు బదులుగా న్యాయవాదుల సంఘం ఒక రూపాయి స్థానంలో 20 రూపాయల స్టాంపును అంటించాలని నిర్ణయం తీసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విధులు బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నటువంటి సమయంలో మిగిలిన న్యాయవాది సంఘాలతో చర్చలు జరిపి అమలు చేయాలని న్యాయవాదులు అన్నారు. ఈ విధానాన్ని రద్దు పరచకపోతే తదుపరి తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేపట్టే అవకాశం ఉందని శ్రీనివాసరావు తెలిపారు.



విధులను బహిష్కరించిన న్యాయవాదులు

## తోటపల్లి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలోని కోదండరామ స్వామి దేవాలయం హుండీలు గురువారం ఉదయం లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.4 లక్షలు 57,940 140 రోజులకు భక్తుల కానుకల రూపంలో వచ్చాయని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మర్రాపు సత్యనారాయ, దేవదాయ శాఖ అధికారి బొబ్బిలి, సాలూరు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి మతల ప్రసాద్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది.

# జెఎఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష ( జెఎఎస్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పిఒ తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రభుత్వం మంచి సంకల్పంతో ప్రారంభించిందని ఆయన చెప్పారు. వైద్య సేవలు అందిన తీరును పరిశీలించారు.

**వీరఘట్టం:** మండలంలోని కంబరలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, మానస వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జిజె ప్రసాద్, వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సీతానగరం:** మండలంలోని బగ్గదొరవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ వివిధ రకాల రోగులను తనిఖీలు నిర్వహించి పూర్తిస్థాయి వైద్యం అందించడం జరుగుతుందన్నారు ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిడిఒ కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైద్యాధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

**కొమరాడ :** మండలంలోని కెమిసిల, పెద్దమరికిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా బగాది జగన్నాథరావు ం తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల వద్ద రిసెప్షన్, మందులు, పరీక్షలు, వైద్యుల సలహాలు, వివరాల నమోదు కౌంటర్లను, పౌష్టికాహారం ప్రదర్శన, అవగాహన శాలలను పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ మంచి వైద్య సేవలు అందించాలని వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు డా. భోగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట : వైద్యసేవలపై ఆరా తీస్తున్న డిఐఒ జగన్మోహన్

**సాలూరు రూరల్ :** మండలంలోని తుంద పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ జరిగింది. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి, దండి శ్రీనివాసరావు, అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నూకయ్య, ఎంపిడిఒ జి.పార్వతి, ఎంపిటిసి సభ్యులు ఆదయ్య, వైద్యాధికారి కనకాల శ్రీకాంత్ ,గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు .

**భామిని :** మండలం లోని చిన్నదిమిలి సచివాలయంలో బాలేరు వైద్య సిబ్బంది డాక్టర్ దీపికరాణి, డాక్టర్ ఫణికుమార్, ఎముకలు వైద్య నిపుణులు కిశోర్, పిల్లలు వైద్య నిపుణులు హారిక 397 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసి, మెరుగైన వైద్యం కోసం 26 మందిని రెఫెర్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, వైసిపిజిల్లా ఉపాధ్యక్షులు కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్ లోతుగెడ్డ రవి, తహశీల్దార్ నీలాపు అప్పారావు, ఎంపిడిఒ జి.చంద్రరావు, సచివాలయం సిబ్బంది వున్నారు.

**వైద్య సేవలపై ఆరా**

**బలిజిపేట :** మండలంలోని సుభద్రలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిడిఒ కె.విజయలక్ష్మి తో కలసి అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లు లో అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.శివగాయత్రి, డి.క్రాంతి కిరణ్మయి, స్పెషలిస్ట్ వైద్యులు, పంచాయతీ సెక్రటరీ బి. మోహనరావు, వైద్య, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



జ్యూట్ నాయకులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

## జ్యూట్ కార్మికుల ఉద్యమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికుల ఉద్యమానికి ఎపిటిఎఫ్ మండల, జిల్లా నాయకులు గురువారం మద్దతు పలికారు. జ్యూట్ మిల్లు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు ప్రకటించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యేశ్వర పాణిగ్రాహి, జిల్లా నాయకులు నాయుడు ప్రభాకర్, ఎంవి గౌరీశంకర్ శిబిరాన్ని సందర్శించి కార్మికుల పోరాటానికి మద్దతుగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. జెఎసి నాయకులు పువ్వల శ్రీనివాసరావు, రెడ్డి సింహాచలం, రెడ్డి సత్యంకు 5116రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

## ప్రతి పంటనూ కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - సాలూరురూరల్

గ్రామీణ ప్రాంతాల్లో గిరిజన రైతులు పండించే అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని అజిత్ ఆర్గనైజేషన్ అధినేత హెచ్.స్వామి తెలిపారు. మండలంలోని ముంగినావలస, గంగన్నదొరవలస, గుడ్డంగివలస, మెట్టవలస గిరిజనులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీరు పండించే అరటి, ధాన్యం, మొక్క జొన్న, కూరగాయలు, కొర్ర మొదలగు అన్ని రకాలైన పంటలను ధరణి ఎఫ్‌పిఒ ద్వారా మద్దతు ధరలకే కొనుగోలు చేస్తామని, కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లో రైతుల అకౌంట్‌లోకి డబ్బులు జమ చేస్తామని తెలిపారు. పంటలను నిల్వ చేసుకోవడానికి ముంగినవలసలో గోడౌన్ కూడా సిద్ధంగా ఉందని, దీన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గంగన్నదొరవలసలో తొత్తడి రామకృష్ణ సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ధరణి సిఇఒ. శాంతి, ఐఎఫ్ఎంఎఎ ఒ..నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి పలువురు అభినందనలు

ప్రజాశక్తి - పాలకొండ

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంతో గురువారం ఆయన్ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. సిఐ మురళీధర్, ఇరిగేషన్ డిఇ దమలపాటి వెంకటరమణ, ఏపి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, డిఎన్ ప్రతినిధులు లిల్లీ పుష్పనాథం, రంగాచారి, ఈశ్వరరావు, తదితరులు కలిసి అభినందించారు.

**భామిని :** రాష్ట్ర ఆర్థిక అంచనా కమిటీ చైర్మన్‌గా విశ్వసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రభుత్వం విప్‌గా నియమితులైనందుకు గాను మండల వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపిటిసీలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## కోటిపాం వద్ద వంతెన ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటిపాం వద్ద జంఝావతి నదిపై నిర్మించిన వంతెనకు ప్రత్యామ్నాయంగా మరో వంతెనను ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ మరో పాతది వంతెనలా కోటిపాం వంతెన కూలిపోక ముందే ఆర్అండ్‌బి అధికారులు వెంటనే కోటిపాం బ్రిడ్జి వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి మూడు రాష్ట్రాలకు చెందిన వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులేకుండా కోరారు. పరిశీలనలో సిపిఎం నాయకులు శివున్నాయుడు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పాలకొండ

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే విస్వసరాయి కళావతి, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణంలో గురువారం 10,13,18 వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్‌చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కొంచాడ అరుణ, కిల్లార మోహన్, భాసురు కాంతారావు, వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, దంగునాయుడు, పలా భాను, తదితులున్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, వండిన పదార్థాలు రుచిని చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం తయారు చేసిన వంటగది పరిసరాలు పరిశీలించి పరిశుభ్రతగా ఉండడం గమనించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ ఉన్నారు.

## పెట్రోల్ బంకు ఉద్యోగాల్లో గిరిజనులకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పెట్రోల్ బంకులో మంతినివలస నిరుద్యోగ గిరిజనులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మంతినవలస గిరిజనుల స్మశాన వాటిక స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థలం ఇచ్చారని, గతంలో ఇక్కడ గిరిజనులకు పెట్రోల్ బంకులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఆ ప్రకారం గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను కోరారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**సాలూరురూరల్ :** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీకి అవసరమైన పనుల నిమిత్తం మంజూరైన సిసి రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్ పనులను మండలంలోని పగులు చెన్నూరులో సర్పంచ్ ప్రతినిధి బెతురు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా నుంచి ఎదురు చూస్తున్న సీసీ రోడ్లు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.


## పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

గుర్రం జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పెద్దవీధి సామాజిక భవనం లో నిర్వహించిన కార్యక్రమంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంబేద్కర్ సాహిత్య పీఠం అద్యక్షులు సోరు సాంబయ్య, కార్యదర్శి బి.అప్పారావు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు మాట్లాడారు. జాషువా కవితలు నిరుపేదలు, కర్షకులు, కార్మికుల కష్టాలు కడగండ్లు గురించి ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది జి.జయరావు పాల్గొన్నారు.

## మీ సేవలు వెల కట్టలేని

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న కౌన్సిలర్ ఆనంద్

సేవే లక్ష్యంగా ముందుకు పోతూ మీరు చేస్తున్న సేవలు విలువ కట్టలేనివని ఏడో వార్డు కౌన్సిల్ సభ్యులు బొత్స ఆనంద్ అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సంద ర్భంగా గురువారం కొత్తవలస లోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో వృద్ధ మిత్ర కోఆర్డినేటర్, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె..కృష్ణమూర్తి ఎందరికో చేసిన సేవలను గుర్తించి ఆ వార్డు కౌన్సిలర్ బొత్స ఆనందరావు, వార్డు ఇన్‌ఛార్జి గొంగాడ చిరంజీవి, విద్యార్థుల సమక్షంలో పుష్ప గుచ్చాలను అందించి దుస్సాలువతో సత్కరించారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ మీ జీవితంలో కొంత నగదును వెచ్చించి పట్టణంతో పాటు మండలంలో ఎంతోమంది వృద్ధులకు, వికలాంగులకు, చిన్నారులకు ప్రతినెలా ఎంతో కొంత సహాయం అందించడం గొప్ప విషయమని కొనియాడారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి : శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో గెలుపు కోసం టిడిపి శ్రేణులు కలిసికట్టుగా సైనికుల్లా పనిచేసి టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత ప్రతి తెలుగుదేశం కార్యకర్తపై ఉందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా "మేము సైతం- బాబుకోసం" అన్న నినాదంతో జియ్యమ్మవలసలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాలు కలకాలం ఉండవన్నారు. యావత్తు టిడిపి నాయకులు పార్టీ విజయానికి కృషి చేయాలని మరోసారి కోరారు. కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ తప్పుడు కేసులతో టిడిపి నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పల్లా రాంబాబు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, నియోజకవర్గ మహిళ దాసరి జోతిర్మయి, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ ప్రధానకార్యదర్శి నందివాడ కష్ణబాబు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గుర్రన శ్రీరామ్మూర్తి నాయుడు, అరుకు పార్లమెంట్ కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు ఎం.సత్యంనాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోల రంజిత్‌కుమార్, అరుకు పార్లమెంట్ కార్యవర్గ సభ్యులు ఎం.విజయాంకుశం, బిసి సెల్ ఉపాధ్యక్షులు అంబటి తవిటినాయుడు , గరుగుబిల్లి మండల టిడిపి ఉపాధ్యక్షులు గొర్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం** చంద్రబాబుకు సంఘీభావంగా మండలంలోని గుచ్చిమిలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, కార్యదర్శి రౌతు వేణుగోపాల నాయుడు, పెద్దలు సాల హరిబాబు, పెద్దబ్బాయి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మోకాళ్లపై నిల్చొని నిరసన**

**సీతంపేట :** బాబుతో నేను రిలే నిరాహార దీక్షల్లో భాగంగా సీతంపేటలో టిడిపి నాయకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు బనాయించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సీతంపేట మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, ఐటిడిపి కో-ఆర్డినేటర్ హిమరక పవన్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** మండలంలో సుంకిలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నేను సైతం బాబు కోసం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.తవిటి నాయుడు, అంబటి రాంబాబు, ఎంబి విజయ అంకుశం, స్థానిక ఎంపిటిసి వై.శ్రీనివాసరావు, ఎం.రామారావు, బి.సత్యనారాయణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజు

## ఘనసరలో వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాలు

ప్రజాశక్తి - భామిని

తమ బాధను, భావలను చెప్పలేని జీవులు వన్య ప్రాణులని, వాటిని దయతో హాని చేయకుండా, జీవ వైవిధ్యం కాపాడాలని పాలకొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి తవిటినాయుడు తెలిపారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో మండలంలోని ఘనసర ఎంపిపి స్కూల్ వన్య ప్రాణి సంరక్షణపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. పిల్లలు వన్య ప్రాణుల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమం లో కొత్తూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.కష్ణారావు, ఫారెస్ట్ బీట్ అధికారులు లక్ష్మన మూర్తి, తరకేశ్వరరావు,కేశవరావు వున్నారు.

**కొమరాడ :** వన్యప్రాణుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొమరాడ అటవీశాఖ అధికారి గౌరీ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వన్య ప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రెడ్డి లక్ష్మీకాంతం, వార్డెన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొమరాడ తహశీల్దార్‌గా భుజంగరావు

ప్రజాశక్తి - కొమరాడ

మండల తహశీల్దారుగా ఎం.భుజంగరావును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వుల జారీ చేశారు. కలెక్టర్ కార్యాలయం నుంచి తహశీల్దారును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన సిహెచ్.రాధాకృష్ణను వివిధ కారణాల రీత్యా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం బదిలీల్లో భాగంగా విశాఖకు చెందిన ఎం.భుజంగరావును కొమరాడ తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - కొమరాడ

రైతుల సమస్యలపై నిరసన తెలిపిన ముగ్గురిపై పెట్టిన కేసును కోర్టు కొట్టివేసినట్లు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022లో ఆర్‌బికెల ద్వారా పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల నుంచి ధాన్యం వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతూ కోటిపాం వద్ద నిరసన చేపట్టామన్నారు. ఈ నిరసనలో పాల్గొన్న తనతో పాటు, టిడిపి నాయకులు బురిడి వేణు, బత్తిలి శ్రీనివాసరావును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి కేసు పెట్టారన్నారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా, పార్వతీపురం కోర్టు వారు కొట్టివేయడం జరిగింది. న్యాయవాది గండి మురళీమోహన్ తమకు అన్ని విధాలా ఈ కేసుకు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు.

## కత్తులకవిటిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటిలో ఈనెల 6న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ చందక సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

# చేసే పనులు ప్రజలకు చెప్పాలి : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పని ప్రజలకు వివరించాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. గురువారం వైసిపి ఎందుకు ఆంధ్రకు జగననే కావాలి కార్యక్రమంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ తెలియజేసే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజలకు చేరవేసే బాధ్యత గృహసారథులు కన్వీనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సంక్షేమ కార్యక్రమాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఎ.వెంకంపేటలోని జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు వైద్య సిబ్బందిని పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, ఎంపిపి మర్రి పారమ్మ, వైసిపి మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కురుపాం :** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లాల్సిన బాధ్యత గ్రామస్థాయిలో ఉండే ప్రజాప్రతినిధులదేనని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానం వద్ద మండలంలో గల సర్పంచులకు, ఎంపిటిసిలకు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి లబ్ది పొందుతున్నారో అన్న దానిపై ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థ పెట్టి నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ వివరాలకు ప్రజలకు విపులంగా వివరించాల్సిన బాధ్యత వైసిపి కుటుంబ సభ్యులదేనన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండలంలో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



శ్రమదానంతో రోడ్డు పనులు చేస్తున్న బియ్యాలవలస గిరిజనులు

## శ్రమదానంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కురుపాం

స్వాతంత్ర్యం వచ్చి సుమారుగా 76 ఏళ్ల అవుతున్నా నేటికీ ఆ గిరిజన గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. వివరాల్లోకి వెళ్తే మండలంలో బియ్యాలవలస పంచాయితీ ఎగువ మంత్రజోలలో 30 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో కొంతవరకు రోడ్డు పనులై సగంలో ఆగిపోయింది. గత కలెక్టర్ హరిజవహర్‌లాల్ మంత్రజోల గ్రామానికి వచ్చి రహదారి నిర్మాణం పూర్తి చేస్తానని గ్రామస్తులకు ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయి. దీంతో ఆ గిరిజన గ్రామ ప్రజలు ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రోడ్డు సౌకర్యంలేని తమ గ్రామానికి రోడ్డు ఉండాలనే దృఢ సంకల్పంతో సుమారు రెండు కిలోమీటర్లు స్వచ్ఛందంగా కొంత డబ్బులు ఎత్తుకొని జెసిబితో పనులు చేయిస్తూ గ్రామస్తులంతా పలుగు, పార పట్టి స్వచ్ఛందంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ ప్రాంతంలో రోడ్డుపనులు కష్టం కనుక తమకు చేతనైనంత వరకు చేయగలుగుతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని నాయుడువీధి రామమందిరం వద్ద రోడ్డు నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ శంకుస్థాపన చేశారు. లక్షా 80వేల రూపాయలతో 50మీటర్ల రోడ్డును నిర్మించనున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని చైర్‌పర్సన్ కోరారు. కార్యక్రమంలో ఇంఛార్జి డిఇ సూరినాయుడు, కౌన్సిలర్ జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కెజిబివి పాఠశాలలో గురువారం మహిళా దిశా ఎస్సై లావణ్య పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. దిశా యాప్‌పై విద్యార్థినిలకు తెలియజేశారు. అనంతరం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో నర్సులకు, స్టాఫ్ నర్సులకు అత్యవసర సమయంలో దిశా యాప్ ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. దిశా యాప్ ఎలా అప్లోడ్ చేయాలో తెలియజేశారు. మహిళా చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ఉన్నారు

## గుత్తేదారులే అధికారులు...

**కొరవడిన పర్యవేక్షణ**

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5.5 కోట్లతో నిర్మిస్తున్న రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో భాగంగా గుత్తేదారులే అధికారుల అవతారమెత్తి పనులు చేస్తున్నారని, సంబంధిత అధికారులు ఒక రోజైనా వచ్చి పనులు పర్యవేక్షించిన పాపం కనిపించలేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. పనుల్లో న్యాన్యత లేకపోతే కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అవుతుందని పలువురు అంటున్నారు. తెలగ వీధి జంక్షన్ వద్ద రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చేసిన పనుల్లో నాణ్యత లేక ఎక్కడికక్కడే పిక్కరాయి కనిపించడంతో వాటిని కవర్ చేసేందుకు గురువారం ప్లాస్టింగ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించాలని, పనులను నాణ్యతతో చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పనుల్లో లోపాలు బయటపడకుండా ప్లాస్టింగ్ చేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు సర్పంచ్ అభినందనలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ విజయవాడలో నిర్వహించిన లఘు చిత్రంగా పురస్కారం అందుకున్న వనమాలిలో నటించిన కిమ్మి పాఠశాల విద్యార్థులు జి.స్వాతి, పి.లికిత, జి.షర్మిల విద్యార్థులకు గురువారం గ్రామ సర్పంచ్ జి.రామ్మోహనరావు, హెచ్ఎం బంకూరు అప్పలనాయుడు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ షార్ట్ ఫిలింకు కెమెరా ఎడిటింగ్ చేసిన పూర్వ విద్యార్థి కొండపల్లి చక్రి, దర్శకత్వం వహించిన గౌరు నాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిరుకానుక అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీల్‌కుమార్, బి.వాసు నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 440 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, డిటిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 44లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటుసారా రవాణా జరుగుతుందన్న సమాచారం గురువారం రావడంతో మండలంలోని కొత్తూరు సమీపంలో కొండ మార్గాన వస్తున్న నాటు సారా క్యాన్లతో ఉన్న ద్విచక్ర వాహనాన్ని వెంబడించారు. కొంత దూరంలో తమ సిబ్బందిని చూసి సారాను విడిచిపెట్టి పారిపోయారు. సదరు ద్విచ్రవాహనాన్ని సీజ్ చేసి 120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఉపేంద్ర తెలిపారు. అలాగే కొత్తూరుకు చెందిన ఇద్దరు పీడిక మాలు, మెల్లిక మధులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. అలాగే మండలంలోని చందలింగి డామ్ సమీపాన నీలగిరి తోటలో తుప్పల మాటున రవాణాకు సిద్ధంగా ఉంచిన 320 లీటర్ల నాటు సారా క్యాన్లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టి ఒడిషాలో దూరువలసకు హిమరిక వెంకటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అలాగే పట్టణంలోని రెల్లివీధి చెందిన కొందరు అనుమానితులను గుర్తించామని, వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు జె.రాజశేఖర్, వి వి రమణ, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను నివారణనివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని మండలంలోని కొత్తూరు సర్పంచ్ ద్వారపురెడ్డి రజిని అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాల కార్యక్రమం గురువారం కొత్తూరులో నిర్వహించారు. ఎంపిడిఒ జి.పైడితల్లి, సూపర్వైజర్లు రౌతు లక్ష్మీ, అరుణకుమారి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు సంబంధించి పోషకాహార లోపం, రక్తహీనతతో బాధపడకుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన బలవర్ధకమైన పోషకాహారం అందించడమే వైయస్సార్ సంపూర్ణపోషణ పథకం ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌వి చింతాడ ఉదయకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు మర్రాపు సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పునః ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మ లక్ష్మీపురం పంచాయతీ గడ్డికాలనీలోని ఎంపిపి ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన ఈ పాఠశాల వందమంది విద్యార్థులతో ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. ఆ తర్వాత పాఠశాల విద్యార్థులు కొన్ని సమస్యల కారణంగా తగ్గి క్రమేపీ తాత్కాలికంగా మూతపడింది. ఇటీవల కాలనీవాసులు తల్లిదండ్రులు విషయాన్ని గ్రామ సర్పంచ్ బి.గౌరీశంకర్రావుకు తెలపగా, తక్షణమే సర్పంచ్, వైస్ ఎంపిపి శేఖర్ ఈ విషయాన్ని ఎంఇఒ చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లగా ఎంఇఒ స్పందించి పాఠశాలను సందర్శించారు. ఎంఇఒ మాట్లాడుతూ కొందరు పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో ప్రధాన గేటు, ఇతర మరమ్మతులు జరిపించి పాఠశాల వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సహకరించిన గ్రామ పెద్దలకు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంఇఒ అభినందనలు తెలిపారు.